# కాంగ్రెస్ వారికే పథకాలు

## సోమిరెడ్డి ధ్వజం



కార్యకర్తల సమావేశంలో ప్రసంగిస్తున్న సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

మనుబోలు, జూన్ 25 (న్యూస్‌టుడే): ప్రభుత్వం ప్రవేశపెట్టే సంక్షేమ పథకాలన్నీ పేదప్రజలకు కాక కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులకే అందుతున్నాయంటూ జిల్లా తెదేపా అధ్యక్షుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ధ్వజమెత్తారు. బుధవారం సాయంత్రం ఇక్కడ ఆ పార్టీ మండలాధ్యక్షుడు జయరామిరెడ్డి స్వగృహంలో నాయకులు, కార్యకర్తలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సోమిరెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని పక్కన బెట్టి నిరంకుశ పాలన కొనసాగిస్తోందన్నారు. ఉపాధి హామీ పనులు కాంగ్రెస్ కార్యకర్తలకు కల్పతరువుగా మారాయని విమర్శించారు. జిల్లాలో రూ.300 కోట్లతో ఉపాధి హామీ పనులు చేపడితే అందులో రూ. 3 కోట్లు కూడా పేదప్రజలకు అందలేదన్నారు. తాగునీరు లేక ప్రజలు, సాగునీరు లేక మెట్ట ప్రాంతాల్లో అల్లాడుతుంటే గ్రామాల్లో మద్యం ఏరులై పారుతోందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించి చైతన్యపరచాలని ఆయన సూచించారు.

జిల్లాలో లక్షలాది ఎకరాలకు సాగునీరు ఇవ్వాల్సి ఉండగాసోమశిల జలాలను ఇతర జిల్లాలకు తరలిస్తుంటే జిల్లాలోని ఎమ్మెల్యేలు, మంత్రులు నిమ్మకు నీరెత్తినట్లు ఉన్నారని, అసలు వీరు ప్రజాప్రతినిధులేనా అని సోమిరెడ్డి దుయ్యబట్టారు. జిల్లా అవసరాలకు ఫణంగా పెట్టి సోమశిల జలాలను తరలించాలని నిర్ణయించిన కాంగ్రెస్ వారు ఈ జలాశయానికి కృష్ణా నుంచి ఎన్ని టి.ఎం.సి.ల నీరు ఇస్తారో జీవో జారీ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం మండల నేతలతో పార్టీ భవిష్యత్తు కార్యాచరణపై చర్చించారు. గురువారం జరిగే కలెక్టరేట్ ముట్టడికి కార్యకర్తలు, నాయకులు తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో తెదేపా నాయకులు తాతా నాగేశ్వరరావు, పొన్నూరు రామకృష్ణయ్య, పచ్చిపాల జయరామిరెడ్డి, రావుల అంకయ్యగౌడ్, చదలవాడ శ్రీహరినాయుడు, రాయిపాటి శరత్, గాలీ బద్రర్స్, మల్లెమాల శ్రీనివాసులురెడ్డి, సర్పంచులు రాయపాటి కృష్ణవేణమ్మ, చెన్నూరు సుధీర్‌రెడ్డి, చెందులూరు పెంచలయ్య, ఎమ్పీటీసీలు రంగారావు, దయాకర్ తదితరులు పాల్గొన్నారు.

### జిల్లా ప్రజలు క్షమించరు..

**రాపూరు:** సోమశిల జలాలను ముఖ్యమంత్రి సొంత జిల్లాకు తరలించేందుకు జారీ చేసిన జీవోను ఉపసంహరించుకోకపోతే నెల్లూరు జిల్లా ప్రజలు క్షమించరని రాష్ట్ర తెలుగు రైతు కార్యదర్శి ఆలూరు వెంకటేశ్వచౌరి పేర్కొన్నారు. బుధవారం రాపూరులో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. సోమశిల జలాశయం కింద ఉన్న భూములు సాగునీరు అందక బీళ్లుగా మారుతుంటే దీని నుంచి 4 టీఎంసీల జలాలను కడప జిల్లాకు తరలించడం దారుణమన్నారు. జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు ప్రత్యక్ష పోరాటానికి దిగి రైతులను ఆదుకోవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అసలు సోమశిల జలాల తరలింపుపై కాంగ్రెస్ ప్రతినిధులు అనుకూలమా, ప్రతికూలమా చెప్పాలన్నారు. గిట్టుబాటు ధరలు లేక నష్టపోతున్న నిమ్మ రైతులను ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఇందిరమ్మ గ్రామాల్లో అభివృద్ధి, లబ్ధిదారుల ఎంపిక అంతా ఏకపక్షంగా జరుగుతోందని, కాంగ్రెస్ కార్యకర్తలు తప్ప పేదలకు న్యాయం జరగడం లేదని విమర్శించారు. ఈ సమావేశంలో రాపూరు పట్టణ అధ్యక్షుడు గోపాల్ తదితరులు ఉన్నారు.